నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మల్లేష్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. కిస్మత్‌పూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆదర్శనగర్, బైరాగిగూడ, భవానీ కాలనీ, బండ్లగూడ గ్రామం, డీడీ కాలనీ, డాన్ బాస్కు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు మాచాంపల్లి కాలనీ, వినాయక్ నగర్, డీడీ కాలనీ, కాళీమందిర్, ఎన్‌ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడామీ, అభ్యుదయనగర్, సంధ్యానగర్, మాచన్‌పల్లి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

లక్ష్మిగూడ ఫీడర్ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. లక్ష్మిగూడ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు లక్ష్మిగూడ గ్రామం, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్‌జీకే, బాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్‌నగర్(హౌసింగ్ బోర్డు) తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


ఉత్సవ మూర్తుల ఊరేగిస్తున్న భక్తులు

శంషాబాద్ రూరల్: నర్కూడ శివారులోని అమ్మపల్లి (సీతారామచంద్ర స్వామి) ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

మధ్యాహ్న భోజనం బిల్లులు వెంటనే చెల్లించాలి

శంషాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కార్మికులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేష్ మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. నెలకు ఇచ్చే వేతనాలు కూడా నిలిచిపోయాయన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంఘం నాయకుడు గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన మల్లన్న జాతర


జాతరలో కార్తీక్‌రెడ్డి తదితరులు

శంషాబాద్: మెహిదిగార్డెన్ సమీపంలోని మల్లన్న ఆలయంలో మూడు రోజులుగా జరిగిన మల్లన్న జాతర మంగళవారంతో ముగిసింది. అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. యాదవ సంఘం నేతలు కార్యక్రమాలను పర్యవేక్షించారు. బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలో జరిగే జాతరలు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకలుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ సతీష్, రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్, నాయకులు చక్రధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్, హన్మంతు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు


పూజలు చేస్తున్న అహోబిల జీయర్ స్వామి

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులో ఉన్న దివ్య సాకేతాలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీ త్రిదండి అహోబిల జీయర్ స్వామి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల ఆరోగ్యాభివృద్ధి, ఆయుష్యాభివృద్ధికి అరుణ పారాయణ హోమం నిర్వహించారు. సాకేత రామచంద్రుడుని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. అహోబిల జీయర్ స్వామి భక్తులకు మంగళశాసనాలు అందజేశారు.

ఏది పడితే అది డంప్

జీహెచ్‌ఎంసీ స్థలం ఆక్రమణకు యత్నం



చందానగర్ సర్కిల్ కార్యాలయం వెనుక ఉన్న జీహెచ్‌ఎంసీ స్థలంలో గేటును తొలగించిన దృశ్యం




చందానగర్ డివిజన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 21 కార్యాలయం వెనుక ఉన్న దంపింగ్ స్థలంపై కబ్జాదారుల కన్నుపడింది. ప్రహరీ పూర్తి స్థాయిలో లేకపోవడంతో భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్, చెత్త చెదారం వేస్తున్నారు. పైగా కొందరు జీహెచ్ఎంసీ స్థలాల్లో ఇసుక, కంకర డంప్ చేసి వ్యాపారం చేస్తున్నారు. మరికొందరు వీధి వ్యాపారులు వ్యాపారానికి సంబంధించిన సామగ్రిని డంప్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన రావడంతో చుట్టుపక్కలవారు ఇబ్బందులు పడుతున్నారు.
– చందానగర్

'ఎఫ్‌డీఐ పరిమితి పెంపుదల నిర్ణయాన్ని విరమించుకోవాలి'

రాజేంద్రనగర్: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఎఫ్‌డీఐ పరిమితి పెంపుదల నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఏఐఐఈఏ జోన్ అధ్యక్షుడు పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌డీఐ పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తుందన్నారు. దీని ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు లాభం చేకూరుతుందన్నారు. విదేశీ పెట్టుబడుల కారణంగా బీమా ఉద్యోగులతో పాటు దానిపై ఆధారపడిన వారంతా రోడ్డున పడుతారని ఆరోపించారు. ప్రస్తుతం పార్లమెంటులో ప్రతిపాదించనున్న బీమా చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు సైతం దిగుతామన్నారు.

రుమా క్రికెట్ కప్–31 విజేత ఆర్‌ఆర్ టీమ్


కప్‌తో ఆర్‌ఆర్ క్రికెట్ జట్టు క్రీడాకారులు

రాజేంద్రనగర్: రుమా క్రికెట్ కప్–31 సీజన్ కప్‌ను ఆర్‌ఆర్ టీమ్ గెలుచుకుంది. మొయినాబాద్ ఎంకపల్లిలో మంగళవారం నిర్వహించిన ఫైనల్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌ఆర్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు 8 వికెట్లను కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గ్లోరీ క్రికెట్ టీమ్ 17 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. మంగళవారం సాయంత్రం గెలుపొందిన ఆర్‌ఆర్ టీమ్‌ను రాజేంద్రనగర్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న మల్లన్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు ఉదయమే గంపలతో ఆలయానికి చేరుకుని అక్కడే అమ్మవారికి బోనాలు సిద్ధం చేసి సమర్పించారు. బోనాల ఉత్సవాల్లో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, వైస్ చైర్మన్ కె.దశరథయాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓం ప్రకాశ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికే జనార్దన్ అధ్యక్షతన కాటేదాన్ బీజేపీ కార్యాలయంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ 2025–26 మధ్య తరగతి ప్రజలు, రైతు సంక్షేమానికి అభివృద్ధికి బాటలు వేస్తునే అన్ని వర్గాలకు సమన్యాయం చేసే బడ్జెట్ అని అన్నారు. చిన్న పరిశ్రమలు ఆపన్న హస్తాన్ని అందించిన బడ్జెట్ అని తెలిపారు. రాష్ట్రాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ సహకార సమైక్య స్ఫూర్తిని గౌరవించి, అన్ని సంక్షేమ పథకాలకు నిధులను పెంచడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోగి రవి, రావుల భాస్కర్, పి.మల్లేష్‌యాదవ్, ఎస్.జగన్, సంతుగౌడ్, టి.చిన్న, మురళీధర్‌రెడ్డి, వెంకటరమణ, వి.లక్ష్మి, అంజమ్మ, ఏ.శంకర్‌రెడ్డి, వి.శ్రీనివాస్, గోపాల్‌నాయక్, ప్రభాకర్, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

మణికొండ: దేశ ఆర్థిక వ్యవస్థను అగ్రభాగానికి చేర్చే దిశలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ.50 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఎంతో శుభపరిణామని బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మణికొండ మర్రిచెట్టు సర్కిల్ వద్ద ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలోని పేద, మధ్య తరగతి, ఉద్యోగులు, చిరువ్యాపారులకు ఎంతో మేలు చేసే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా దేశం ఎదిగిందన్నారు. రాబోయే రోజుల్లో మూడవ శక్తిగా ఎదిగేందుకు బాటలు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి ఇందిర, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత చౌదరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వినోద్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి శివకుమార్, నాయకులు ఎం. రాఘవరెడ్డి, జె.లక్ష్మీరాములు, ఆనంద్‌రావు, సతీష్, మధు తదితరులు పాల్గొన్నారు.


మణికొండ మర్రిచెట్టు సర్కిల్ వద్ద..

అంతర్జాతీయ సెమినార్‌కు డాక్టర్ రవీందర్‌రెడ్డి



శంషాబాద్: సింగపూర్ యూనివర్సిటీలో జరుగుతున్న అంతర్జాతీయ సెమినార్‌కు శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. భారత దేశం నుంచి వాతావరణ మార్పులు అంశంపై డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఉన్నత విద్యా సుస్థిరాభివృద్ధి అంశంపైన ప్రొఫెసర్ డాక్టర్ బాలయోగి, ఈటబుల్ కాస్మోటిక్స్ అంశంపైన మహారాష్ట్రకు చెందిన డాక్టర్ సకినాలను పరిశోధన పత్రాలు సమర్పించడంతో పాటు పలు చర్చావేదికల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సింగపూర్ విశ్వవిద్యాలయం సామాజిక న్యాయశాస్త్ర ప్రతినిధి థాం షాంగై వారికి వారికి స్వాగతం పలికారు. సింగపూర్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య..ఉపాధి అవకాశాలపై తొలిరోజు సాముహిక చర్చలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్


డ్రోన్ ద్వారా మూసీ నదిలో పిచికారీ చేస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సౌత్ జోన్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దోమల నియంత్రణ కోసం మూసీలో డ్రోన్ ద్వారా యాంటీ లార్వా వెదజల్లే కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ సర్కిల్‌లో నిర్వహించారు. అత్తాపూర్ నుంచి బుద్వేల్ వరకు మూసీ కాలువలో డ్రోన్ ద్వారా యాంటీ లార్వాను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..గతంలో సిబ్బంది మూసీలోకి దిగి యాంటీ లార్వాను పిచికారీ చేయించేవారని, ఈ కార్యక్రమం కొన్ని వారాల పాటు కొనసాగేదన్నారు. డ్రోన్ వినియోగంతో కేవలం ఒక్క రోజులోనే లార్వా పిచికారీ సాధ్యమవుతుందన్నారు.

నార్సింగిలో ఇరు వర్గాల దాడులు

మణికొండ: పక్కింటి వారి మురుగు నీరు తమ ఇంట్లోకి వస్తున్నాయని ప్రశ్నించినందుకు దాడులు చేసుకున్న ఘటన నార్సింగిలో మంగళవారం జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో నిజాముద్దీన్, రయీముద్దీన్, మొయినుద్దీన్, సయ్యద్ అల్తాఫ్, సయ్యద్ జునీత్ పక్క పక్క ఇళ్లల్లో నివసిస్తారు. ఒకరి ఇంటి మురుగు నీరు పక్కింట్లోకి వస్తున్నాయని, అలా రాకుండా చూసుకోవాలని మందలించారు. దీంతో కోపోద్రుక్తులు అయిన మరో ఇంటి వారు దాడులకు దిగారు. నిజాముద్దీన్‌ను పాత్రతో కొట్టడంతో అతని తలకు గాయమయ్యింది. ఇరువర్గాల వారు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని డీజీఎంకు వినతి


డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: సికింద్రాబాద్‌లోని రైల్వే డీజీఎం ఉదయ్‌నాథ్ కోట్లను మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్, శ్రీరామ్‌నగర్, వేంకటేశ్వర కాలనీ, కాటేదాన్ ప్రాంతాల్లో కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలు ఇక్కడ వలస వచ్చి జీవిస్తున్నారన్నారు. సికింద్రాబాద్ నుంచి కర్నూల్ వరకు ప్రయాణించే తుంగభద్ర ట్రైన్ బుద్వేల్‌రైల్వే స్టేషన్ స్టాపింగ్ ఉంది. కానీ రాత్రి తిరుగు ప్రయాణించే సమయంలో స్టాప్ లేదన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్టాప్ పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరామన్నారు. అలాగే కొద్ది రోజుల క్రితం రైల్వే స్టేషన్‌లోకి వెళ్లడానికి గతంలో ఉన్న దారిని రైల్వే అధికారులు మూసి వేశారన్నారు. ప్రజలు స్టేషన్‌లోకి వెళ్లడానికి సరైన మార్గాన్ని కేటాయించాలని ఆయనను కోరామన్నారు. సంబంధిత అధికారులను పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి


మాట్లాడున్న ఎస్ఈ శ్రీరామ్మోహన్

మైలార్‌దేవ్‌పల్లి: వేసవిలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ శ్రీరామ్మోహన్ తెలిపారు. మంగళవారం శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో డీఈ రత్నాకర్‌రావు అధ్యక్షతన అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు ఈశ్వర్‌ప్రసాద్, సత్యనారాయణ, రమేష్‌తో కలిసి ఆయన వేసవిలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పర్యవేక్షించేందుకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వినియోగదారులు తమ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను ఆయా ప్రాంతాల్లో గల అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి పరిష్కరించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. మంగళవారం బుద్వేల్ రైల్వే స్టేషన్‌ను అధికారులు, నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బుద్వేల్ రైల్వేస్టేషన్ నుంచి నేతాజీనగర్ మీదుగా నిత్యం వందలాది మంది ప్రజలు వెళ్తున్న మార్గాన్ని రైల్వే అధికారులు అకస్మాత్తుగా మూసివేశారన్నారు. వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించానన్నారు. ప్రజలు వెళ్లడానికి మూడు ఫీట్ల దారి ఇవ్వడానికి రైల్వే అధికారులు ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏఈ, స్థానిక నాయకులు మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్, కృష్ణాగౌడ్, రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


లక్ష్మీశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ తెలుగు టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఈసీ సభ్యురాలిగా ఎన్నిక కావటంతో మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళలు వ్యాపారాలు, రాజకీయాలు, నటనారంగంతో పాటు వారికి నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీకి చేసిన కృషికి ఆమెకు ఇటీవల నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవిని ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేష్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రవణ్‌కుమార్, సాగర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టండి


ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు

మణికొండ: మద్యం మత్తులో ఆకతాయిలు చేస్తున్న ఆగడాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న దొంగల ఆగడాలను అరికట్టాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆదివారం అర్ధరాత్రి మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ కాలనీలో మద్యం, గంజాయి సేవించి ఆకతాయిలో ఇంటికి వస్తున్న ఓ విద్యార్థిని కొట్టారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కాలనీవాసులపైకి ఎదురుతిరిగారని వివరించారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఓ మహిళ వాకింగ్ చేస్తుండగా వెనకనుంచి వచ్చిన ఓ దొంగ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని వెళ్లాడన్నారు. రెండు ఘటనలు ఒకే రోజు జరగటంతో ప్రజలు భయాందోళన చెందారని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్‌ముదిరాజ్, మైనారిటీ అధ్యక్షుడు హాజీ, నాయకులు పురుషోత్తం, రమేష్, శ్రవణ్, అఖిల్, శరత్, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఉపనయనం


ఉపనయనం కార్యక్రమంలో డాక్టర్ రాంకుమార్ తివారీ, రాకేష్ తివారీ

చార్మినార్: పేద బ్రహ్మణులను ఆదుకోవడానికి తమ సంఘం నిరంతర కృషి చేస్తుందని దక్షిణ భారతీయ కన్య కుబ్జ్ సభ అధ్యక్షుడు డాక్టర్ రాంకుమార్ తివారీ అన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పేద బ్రహ్మణ విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అంద జేస్తున్నామన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పాతబస్తీ అంబికానగర్‌లోని కన్య కుబ్జ్ భవనంలో 14 మందికి ఉపనయనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వస్తు సామగ్రి పూర్తిగా దక్షిణ భారతీయ కన్య కుబ్జ్ సభ ఉచితంగా అందజేసింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రాంకుమార్ తివారీ మాట్లాడుతూ.. ఇప్పటికే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది ఉపనయనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాకేష్ తివారీ, ప్రధాన కార్యదర్శి విజయ్‌పాల్ పాండే, కోశాధికారి గోపాల్ ప్రసాద్ శుక్లా, సంయుక్త కార్యదర్శి భవానీ ప్రసాద్ తివారీతో పాటు బాల ప్రసాద్ తివారీ, రాజేంద్ర ప్రసాద్ తివారీ, శోభా దూబే, జయశంకర్ ప్రసాద్ తివారీ పాల్గొన్నారు.

తెలంగాణలో మజ్లిస్ పార్టీకి ఆదరణ

గోల్కొండ: తెలంగాణలో మజ్లిస్ పార్టీకి ప్రజల ఆదరణ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం మజ్లిస్ పార్టీ రంగారెడ్డి జిల్లాకు చెందిన మజ్లిస్ నాయకులు టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ ఎప్పుడూ యువతకు పెద్దపీట వేసిందన్నారు. దళితులు, బీసీల పక్షాన పోరాడే పార్టీ మజ్లిస్ ఒక్కటే అని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో తమ పార్టీ వరుసగా మూడుసార్లు విజయం సాధించడంలో యువత పాత్ర ఎంతో ఉందన్నారు. అదే విధంగా దళితులు ఏకపక్షంగా మజ్లిస్ పార్టీని ఆదరించడం వల్ల కూడా మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేసిన ప్రతి స్థానంలో విజయం సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ కార్పొరేటర్ నసీరుద్దీన్, మహ్మద్ ఫాజిల్ ఇర్ఫాన్, యాకుబ్ ఆలీ, నవీద్ అహ్మద్, జహంగీర్ కురేషి, షాహెద్ ఆలీ, ఉమర్ తదితరులున్నారు.